మెదక్ రూరల్ : మంబోజిపల్లిలోని కొయ్యగుట్టపై మల్లన్నస్వామి కల్యాణ ఉత్సవాలు

పెద్దశంకరంపేటలో కన్యాకపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కల్యాణం.. కమనీయం

- కన్నుల పండువలా కొయ్యగుట్ట మల్లన్న కల్యాణం
- కిటకిటలాడిన దేవాలయం
- హాజరైన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్‌రూరల్, ఫిబ్రవరి 11 : మండల పరిధిలోని మంబోజిపల్లి శివారులోని కొయ్యగుట్టపై కొలువుదీరిన మల్లికార్జున స్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మల్లన్న స్వామి ఆలయ పూజారి మల్లన్న ఆధ్వర్యంలో మల్లన్నస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామికి ప్రత్యేక పూజలు, గంగా, యమునా, సరస్వతి, పుణ్య నదుల జలాలతో ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. తాళి, మట్టెలు, ఒడిబియ్యం, దుస్తులు తీసుకువచ్చి వేదమంత్రోచ్చరణల మధ్య మల్లన్నస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు ఒడిబియ్యం సమర్పించారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బండ్ల ఊరేగింపు, ఒగ్గు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజల్లో అర్చకులు మల్లన్న స్వామి, మల్లికార్జున్, వేదపండితులు మాచవరం సర్పంచ్ సంధ్యాశ్రీనివాస్‌చౌదరి, సిద్దార్థ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.

వాసవిమాతకు కుంకుమార్చన

పెద్దశంకరంపేట, జనవరి 11 : వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం పెద్దశంకరంపేటలోని ఆర్యవైశ్య భవనంలో మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గుప్తా మాట్లాడుతూ.. అహింసా మార్గమే మానవాళికి శ్రేయస్కరమన్నారు. త్యాగశీలిగా వాసవీకన్యకాపరమేశ్వరీ అమ్మవారు ఆర్యవైశ్యులకు ఇలవేల్పు అన్నారు. కాశీ, మక్కా, జెరుసలాం ప్రదేశాలు ఎంత పవిత్రమో ఆర్యవైశ్యులకు వాసవిమాత జన్మస్థలం పెనుగొండ అంతే పవిత్రమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మి, ఆర్యవైశ్య మహిళా సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాగం అర్చన, చకిలం విశాల తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చనలు

చేగుంట, ఫిబ్రవరి 11 : మండలకేంద్రంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆరాధన దినోత్సవం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటలక్ష్మీరఘురాములు, ఆర్యవైశ్య నాయకులు గణేశ్, నాగభూషణం, రాజేశ్వర్, శ్రీనివాస్, పరంజ్యోతి, పాండు, కాచం శంకర్, చందు, గోలిఅశోక్, ఏర్రం శంకర్ పాల్గొన్నారు.

చాముండేశ్వరికి ప్రత్యేక పూజలు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 11 : మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో చాముండేశ్వరీ ఆలయంలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం సమీ పంలోని మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి కుంకు మార్చన, ఒడిబియ్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన పూజారి ప్రభాకరశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా వేంకటేశ్వరాలయ ఉత్సవాలు

రామాయంపేట, ఫిబ్రవరి 11 : రామాయంపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పద్మావతి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ సభ్యులు, వేదబ్రాహ్మణులు వెంకటరమణాచార్యులు, సత్యనారాయణ, రాఘవేందర్‌చారి పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

రామాయంపేట పట్టణంలోని ఎల్లమ్మ ఆలయంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం గౌడ సంఘం అధ్వర్యంలో ఎల్లమ్మ అమ్మవారికి సిద్ధియోగం నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

మెదక్ రూరల్ : మల్లన్నస్వామి కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే రోహిత్‌రావు

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు

మెదక్‌లోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 11 : ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు 10వ రోజు ఆదివారం జిల్లావ్యాప్తంగా సజావుగా జరిగాయని ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడుతల్లో జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 564 మంది విద్యార్థులకు 536 మంది హాజరైనట్లు తెలిపారు. జనరల్‌లో 477 మందికి 458 మంది, ఒకేషనల్‌లో 87 మందికి 78 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. పెద్దశంకరంపేట(ఏ) మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రాలను ఇంటర్ అధికారి పర్యవేక్షించారు.

'గృహజ్యోతి' వివరాల సేకరణ

రామాయంపేటలోని కేసీఆర్ కాలనీలో వివరాలు సేకరిస్తున్న ఏడీఈ సుధాకర్

రామాయంపేట, ఫిబ్రవరి 11 : గృహజ్యోతి పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ సుధాకర్ సూచించారు. ఆదివారం రామాయంపేట పట్టణంలోని కేసీఆర్ కాలనీ, సుభాష్‌రోడ్‌లో గృహజ్యోతి లబ్ధిదారుల వివరాలు సేకరించారు. విద్యుత్‌శాఖ సిబ్బంది చేపట్టిన కరెంట్ మీటర్ల వివరాల నమోదు ప్రక్రియను ఏడీఈ సుధాకర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గృహజ్యోతి పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంట్ సరఫరా చేస్తుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు కరెంట్ మీటరు నెంబర్‌తోపాటు సెల్‌ఫోన్ నెంబర్, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ప్రజాపాలన దరఖాస్తు రసీదు వివరాలను తెలియజేస్తూ ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించి, ఆన్‌లైన్ చేస్తారన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే స్థానికంగా ఉన్న ఏఈలు, లైన్‌మన్ల సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ పెంట్యానాయక్, అక్కౌంట్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి, సబ్‌ఇంజినీర్లు వంశీ, శ్రీశైలం, వినీల ఉన్నారు.

'ఆటోబంద్' విజయవంతం చేయాలి

'ఆటో బంద్' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌టీయూ ఆటోయూనియన్ నాయకులు

- 16న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- బీఆర్‌టీయూ ఆటోయూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య

తూప్రాన్, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో తాము ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని, అందుకు నిరసనగా ఈ నెల 16న నిర్వహించనున్న 'ఆటోబంద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్‌తో కలిసి 'ఆటోబంద్' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తున్న ఉచిత ప్రయాణ పథకానికి తాము వ్యతిరేకం కాదని, కానీ, దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఆటో నడుపుకొంటూ జీవిస్తున్న వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 21 మంది ఆటోడ్రైవర్లు మృతి చెందారన్నారు. ఉపాధి కోల్పోయి, మరణించిన కుటుంబాలకు మద్దతుగా ఈ నెల 16న రాష్ట్రవ్యాప్తంగా ఆటో, క్యాబ్, మోటర్ రవాణా బంద్‌కు పిలుపునిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్పుల బాల్‌రాజ్, కౌన్సిలర్లు తలారి పద్మామల్లేశ్, ఉమాసత్యలింగం, ఆటోయూనియన్ నాయకులు నిమ్మ యాదగిరి, పర్స ప్రభాకర్, చిటిమిల్ల సత్యనారాయణ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రన్నింగ్ పోటీల్లో

కానిస్టేబుల్‌కు కాంస్యం

- అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ప్రభాకర్‌గౌడ్ ఎంపిక

అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన కానిస్టేబుల్ ప్రభాకర్‌గౌడ్

పాపన్నపేట, ఫిబ్రవరి 11 : గచ్చిబౌలిలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ రన్నింగ్ పోటీల్లో పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ ప్రభాకర్ గౌడ్ కాంస్య పతకాన్ని సాధించి శ్రీలంకలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఎల్లాపూర్ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, యువజన సంఘాల ప్రతినిధులు ప్రభాకర్‌గౌడ్‌ను అభినందించారు.

మల్కాపూర్‌లో

400వ 'స్వచ్ఛవారం'

తూప్రాన్, ఫిబ్రవరి 11 : మండలంలోని మల్కాపూర్‌లో నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ విజయవంతంగా 400వ వారానికి చేరుకుంది. ఆదివారం 6వ వార్డులోని దుర్గమ్మ దేవాలయ ప్రాంగణం పరిసరాల్లో చెత్తాచెదారాన్ని మేకిన్ మల్కాపూర్ యువత, పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు

ప్రత్యేక శిక్షణ

రామాయంపేట. ఫిబ్రవరి 11 : రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సత్తాచాటడానికి క్రీడాకారులు సన్నద్ధం అవుతున్నారు. రామాయంపేట కళాశాల గ్రౌండ్‌లో క్రీడాకారులకు యువజ్యోతి ఫుట్‌బాల్ అసోసియేషన్ కోచ్ సత్యనారాయణ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగే క్రీడాపోటీల్లో పతకం సాధిస్తామని క్రీడాకారులు పేర్కొంటున్నారు.

చిన్నశంకరంపేటలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

మెదక్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- సంపూర్ణ పారిశుధ్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

చిన్నశంకరంపేట,ఫిబ్రవరి11 : సంపూర్ణ పారిశుధ్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సూచించారు. ఆదివారం చిన్నశంకరంపేటలో ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మెదక్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యలక్ష్మి, గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీవో గిరిధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జీవన్, మాజీ ఏఎంసీ చైర్మన్ గంగానరేందర్, నేతలు మంగ్యానాయక్, మేడి గణేశ్ ఉన్నారు.

ముషీరాబాద్ ఆర్యవైశ్య హాస్టల్

కార్యవర్గ సభ్యుడిగా నారాయణగుప్తా



హైదరాబాద్‌లో నియామక పత్రం అందుకుంటున్న కౌన్సిలర్ నారాయణగుప్తా

తూప్రాన్, ఫిబ్రవరి 11 : ముషీరాబాద్‌లోని వాసవీ ఆర్యవైశ్య హాస్టల్ కార్యవర్గ సభ్యుడిగా తూప్రాన్ పట్టణానికి చెందిన 16వ వార్డు కౌన్సిలర్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కోశాధికారి, సంఘ సేవకుడు కొడిప్యాక నారాయణగుప్తా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పద్మశ్రీ గెల్లు రమేశ్, వైశ్యరత్న గంజి రాజమౌళిగుప్తా తదితరులు నారాయణగుప్తాకు నియామక పత్రాన్ని అందజేశారు. మాజీ ఎంపీ వెంకటేశ్, ఎమ్మెల్సీ దయానందగుప్తా, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, మాజీ సీఎం రోశయ్య కుమారుడు శివకుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త బండారు సుబ్బారావు, రమేశ్‌గుప్తా, ఆర్యవైశ్య హాస్టల్ కమిటీ సభ్యులు, తూప్రాన్ ఆర్యవైశ్య సంఘం నాయకులు నారాయణగుప్తాను ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు.

కిటకిటలాడిన మెదక్ చర్చి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 11 : మెదక్ చర్చి భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం కావడంతో భక్తులు, పర్యాటకులు భారీగా తరలివచ్చారు. దీంతో చర్చి ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వందలాది భక్తులు పాల్గొన్నారు. చర్చి ప్రేసీబేటరి ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య దైవ సందేశం చేశారు. భక్తులు చర్చి ఆవరణలోని చెట్ల కింద వంటావార్పు చేసుకున్నారు. ప్రార్థనల్లో ఫాస్టర్లు శ్రీనివాస్, సువర్ణ, జైపాల్, డేవిడ్ రిచర్డ్స్, చర్చి కమిటీ సభ్యులు సంపత్, సువన్‌డగ్లస్, నోబుల్‌సన్, శాంసన్ సందీప్, ఫ్రాంక్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులను ఆశీర్వదిస్తున్న పాస్టర్లు



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

బీఆర్ఎస్ పథకాలు దేశానికి ఆదర్శం

- కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మరు
- మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేటలో మట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రామాయంపేట, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశపూరితంగా ఉందని, అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రం, కౌన్సిలర్ యాదగిరి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నాగరాజు, నాయకులు కొండల్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఆదివారం రామాయంపేటలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మరన్నారు. ముందుగా కేంద్రం నుంచి నిధులు తేవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అనవసరంగా కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేసి అభాసుపాలు కావద్దని సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిందని, కాంగ్రెస్ ప్రభు త్వం గతంలో జరిగిన అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు.

ఖమ్మం తరలిన టీపీటీఎఫ్ ప్రతినిధులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 11 : టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలు ఖమ్మంలో జరుగుతున్నాయి. సభలకు జిల్లా నుంచి వందమంది ప్రతినిధులు ఆదివారం వెళ్లారు. వీరిలో టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగయ్య వెంకట్రాంరెడ్డి, నాయకులు యాదగిరి, రాంచంద్రం, ముత్యాలు, గోపాల్ శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ, హీరాలాల్, సాయిబాబా ఉన్నారు.

యువతుల వివాహాలకు దాతల చేయూత

నిజాంపేట/ రామాయంపేట రూరల్, ఫిబ్రవరి 11 : మండలంలోని వెంకటాపూర్ (కే) గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన యువతి వివాహానికి మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అండగా నిలిచారు. స్థానికంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు యువతి కుటుంబ సభ్యులకు ఆదివారం పుస్తెమట్టెలు అందజేశారు. గ్రామానికి చెందిన సత్యనారాయణ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి యువతి వివాహానికి బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేశం, భాస్కర్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు అందజేత

రామాయంపేట రూరల్, ఫిబ్రవరి 11 : రామాయంపేట మండలంలోని దామరచెర్వు గ్రామానికి చెందిన నిరుపేద వధువు వివాహానికి మాజీ సర్పంచ్ పిట్ల సిద్ధవ్వ, యాదగిరి దంపతులు ఆదివారం పుస్తెమట్టెలు అందజేశారు. పేదకుటుంబాలను దాతలు ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికులు రాజు, శివ, బాల్యా, రాజ్యా, లాల్యా, కేశవ, భాస్కర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సమాజంలో గుర్తింపు

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- చేగుంటలో ముగిసిన క్రికెట్ పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేత

చేగుంట, ఫిబ్రవరి 11 : క్రీడాకారులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గతంలో క్రికెట్ టోర్నమెంట్ అంటే సిద్దిపేటనే గుర్తుకు వచ్చేదని, అలాంటి టోర్నమెంట్లు ప్రస్తుతం చేగుంటలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. చేగుంటలో నిర్వహించిన సీసీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు ఆదివారం ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రంగయ్యగారి రాజిరెడ్డి, చేగుంట మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు మనోహర్‌రావు పాల్గొన్నారు.

మైనార్టీ అధ్యక్షుడికి సన్మానం

చేగుంట మండలం మక్కరాజిపేట గ్రామంలో మైనార్టీ అధ్యక్షుడిని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సన్మానించి అభినందించారు. ముస్లిం సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా సయ్యద్ యదవత్ గోరి, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ సమీద్, కార్యదర్శిగా ఖాజా ఫైసలుద్దీన్ ఫరీద్, అడ్వైజర్‌గా సమ్మిపటేల్ ఎన్నికైయ్యారు. కార్యక్రమంలో సమ్మిపటేల్, జడ్పీటీసీ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మనోహర్‌రావు, రంగయ్యగారి రాజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు మచికట్ల శ్రీనివాస్, కుమ్మరి శ్రీనివాస్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మక్కరాజిపేటకు చెందిన కార్యకర్త చెన్నబోయిన స్వామి, మృతుడు బోయిని సత్తయ్య, ఎర్రగోల్ల రమేశ్, చేగుంటలో తొడుపునూరి రాజు, వంటరి గోవిందరెడ్డి కుటుంబాలను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు.

చేగుంటలో సీసీఎల్ క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మక్కరాజిపేటలో మైనార్టీ సంఘం నాయకులతో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

- ఫీజు రీయింబర్స్‌మెంట్స్, మెస్ చార్జీలపై స్పష్టత కరువు
- మెదక్ లో ఎస్ఎఫ్ఐ ఆందోళన

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని, బడ్జెట్‌లో భారీగా నిధుల కోత విధించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ మండిపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ చౌరస్తాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ శ్రేణులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి కేవలం 7.8 శాతం బడ్జెట్ కేటాయించిందని, గత బడ్జెట్ కంటే రూ. 1.31శాతం మాత్ర మే పెంచారన్నారు. ఉస్మానియా యూనివర్శిటీ, మహిళా యూనివర్శిటీ అభివృద్ధితోపాటు బాసర ఐఐఐటీ అభివృద్ధి, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లో నూతన యూనివర్శిటీ ఏర్పాటుకు రూ. 500కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ రూ.7200 కోట్లు పెండింగ్‌లో ఉన్నా, వాటి చెల్లింపులపై హామీ లేదన్నారు. బడ్జెట్‌లో 15శాతం నిధులు విద్యారంగానికి కేటాయిస్తామని చెప్పి, 7.8 శాతం నిధులు మాత్రమే కేటాయించారని ఆరోపించారు. ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి నిధులు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆజయ్, కార్తీక్, నవీన్, వంశీ, కృష్ణ పాల్గొన్నారు.

మెదక్ పట్టణంలోని పోస్టాఫీస్ చౌరస్తాలో ప్లకార్డ్స్‌తో ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, Kannaiahgari Chandra Babu S/o. Kannaiahgari Veeraiah, DOB: 05-06-1967, Occ: Business, R/o. H.No. 13-41/2, Medak Road, Shankarampet-A, Mandal: Shankarampet (A), Dist: Medak. I have state that my name was mentioned in my SSC Memo as K CHENDERBABU S/o. VEERAIAH, but my correct name is **KANNAIAHGARI CHANDRA BABU**. So I declaring that my correct name is **KANNAIAHGARI CHANDRA BABU** for all purposes.
NT-SNG

★I, Pabba Srivivas S/o. Pabba Chiranjeevulu, DOB: 19-05-1971, Occ: Business, R/o. H.No. 13-41/1/A, Narsingi Road, Shankarampet-A, Mandal: Shankarampet (A), Dist: Medak. I have state that my name was mentioned in my SSC Memo as P SRINIVASULU S/o. CHIRANJEEVULU, but my correct name is **PABBA SRINIVAS**. So I declaring that my correct name is **PABBA SRINIVAS** for all purposes.
NT-SNG

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.